కొండలపై అందమైన చిత్రాలు



కేంద్రం ఎదురుగా ఉన్న కొండపై చిత్రించిన నెమలి బొమ్మ



హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా సలీంబాబా దర్గా కొండలపై రూపుదిద్దుకోనున్న చిత్రాలు

బోరబండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండలను అందంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలోని కొండలకు రంగులు వేసి వాటిపై అందమైన చిత్రాలను గీసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-2 దళిత అధ్యయన కేంద్రం ఎదురుగా ఉన్న మహాత్మానగర్ కొండపై నెమలి చిత్రాన్ని ఆకట్టుకునే విధంగా గీయించారు. అలాగే, హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ఎదురుగా సలీంబాబా దర్గా కొండలపై కూడా ఆకర్షణీయమైన చిత్రాలు గీసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. కొండలమయమైన ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలోని మరికొన్నిచోట్ల ఈ విధమైన చిత్రాలను గీయించే అవకాశం ఉంది.

చేనేత రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పంజాగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని వక్తలు ఆరోపించారు. గతంలో నేతన్నల ప్రయోజనాల కోసం 18 రకాల పథకాలు ఉండేవని.. ప్రస్తుతం రెండే ఉన్నాయని తెలిపారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాజేశం అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'చేనేత సమస్యల పరిష్కారం- ప్రభుత్వాల వివక్ష' అనే అంశంపై జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఆధారపడిన చేనేత రంగంలో, నేతన్నల ఆత్మహత్యలు కూడా ఎక్కువగానే ఉన్నాయని తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మహాత్మా గాంధీ చరకా పట్టుకుని తిరుగుతూ నూలు వడుకుతూ స్వదేశీ ఉద్యమానికి పునాది వేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం మరోసారి స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరముందన్నారు. పాలకులు ఈ రంగం మీద పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు కానీ, బడ్జెట్ కేటాయింపులు మాత్రం లేవని విశ్రాంత ఐఏఎస్ టి.చిరంజీవులు అన్నారు. చేనేత రంగానికి చెందిన ప్రజాప్రతినిధులు చట్టసభల్లో లేకపోవడంతో వారి తరఫున ఎవరూ మాట్లాడడం లేదని ఆయన తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన 21 హామీలలో రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, సమగ్ర చేనేత విధానం రావాలని పబ్లిక్ పాలసీ నిపుణుడు డి.నర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు.



స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం సనత్‌నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ జరిగింది. దీనిని తలసాని ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, లక్ష్య సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, అగస్టీన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకుడు ఖలీల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మక్కా బాధిత కుటుంబాలకు కేంద్రం అండ

బంజారాహిల్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మక్కా దర్శనానికి వెళ్లి సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు జెడ్డాలోని భారత రాయబార కార్యాలయం సిబ్బందితో కేంద్ర మంత్రులు ప్రతీ నిత్యం మాట్లాడుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబసభ్యులు సౌదీకి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పాస్‌పోర్టు సమస్య తలెత్తితే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కార్యాలయం నుంచి విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడి తగిన చొరవ తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలి

పంజాగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీల దోపిడీని ఆపాలని తెలంగాణ స్టేట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ పి.రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జన సమితి(టీజేఎస్) పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు పి.యాదగిరి, కో-ఆర్డినేటర్ భిక్షపతి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

యూసుఫ్‌గూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడకు చెందిన శంకరి వెంకటేష్ నిరుద్యోగి. ఈయనకు ఎనిమిది నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఎలైట్ గ్లోబల్ ఓవర్సీస్ ఉద్యోగి బి.దుర్గాప్రసాద్ పరిచయమయ్యాడు. పలుమార్లు వెంకటేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆస్ట్రేలియాలో సూపర్ మార్కెట్ సూపర్‌వైజర్ ఉద్యోగం ఉంది. నెలకు రెండు లక్షలు జీతమని నమ్మించాడు. అమీర్‌పేటలోని వాసవి ఎంపీఎం గ్రాండ్‌లోని ఎలైట్ గ్లోబల్ ఓవర్సీస్ కార్యాలయానికి పిలిచి, వీసా, ప్రాసెసింగ్ ఛార్జీలుగా మూడు లక్షలు ఖర్చవుతుందని, అడ్వాన్స్‌గా రూ.50 వేలు అడిగాడు. 14 ఫిబ్రవరి 2025న ఫోన్ పే నుంచి వెంకటేష్ రూ.50 వేలు పంపాడు. దుర్గాప్రసాద్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాపారం పేరుతో..

వ్యాపారం పేరుతో మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఎండీ.షాహిద్ అయాజ్ ఇంట్లో నిజాముద్దీన్ అద్దెకు ఉన్నాడు. ఇంటి యజమానితో పరిచయం పెంచుకొని హీరోహోండా విడిభాగాల తయారీ కంపెనీలో పెట్టుబడి పెట్టండి, వచ్చిన లాభంలో సగం వాటా ఇస్తానని చెప్పాడు. నిజాముద్దీన్ మాటలు నమ్మిన అయాజ్ 2019 నుంచి 2021 వరకు విడతలవారీగా రూ.70 లక్షలు నిజాముద్దీన్‌కు ఇచ్చాడు. కంపెనీ లాభంలో వాటా ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇల్లు కూడ ఖాళీ చేశాడని అయాజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాట్ల కొనుగోలు పేరుతో..

ప్లాట్ల కొనుగోలు పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్‌కు చెందిన పి.వెంకటరామరాజుకు వారాహి ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని మియాపూర్‌కు చెందిన మదనాడ గణేశ్ పరిచయస్థుడు. వెంచర్‌లో ప్లాట్‌లు తక్కువ ధరకు ఇస్తానని గణేశ్ చెప్పాడు. నమ్మిన వెంకటరామరాజు మూడు ప్లాట్‌లకు విడతల వారీగా రూ.13 లక్షలను ఫోన్ పే నుంచి చెల్లించాడు. 31 ఆగస్టు 2024న రసీదులు ఇచ్చాడు. ప్లాట్‌లు చూపించకుండా వారాహి సంస్థను మూసేశారు. దీంతో ప్లాట్లు చూపించండి లేదా డబ్బు తిరిగి ఇవ్వండి అని గణేశ్‌ను నిలదీయడంతో బెదిరింపులకు పాల్పడుతూ దుర్భాషలాడని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు.

థార్ కారును ఢీకొట్టిన కంటైనర్

● పూర్తిగా దెబ్బతిన్న కారు, తిరగబడిన కంటైనర్
● ఇద్దరికి స్వల్ప గాయాలు
● బేగంపేట ప్రధాన రహదారిలో ఘటన



కారును ఢీకొట్టి తిరగబడిన కంటైనర్

బేగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కారును వెనక నుంచి వేగంగా వచ్చిన భారీ కంటైనర్ ఢీకొట్టి బోల్తా పడింది. కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ సంఘటన బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్ట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ ఉదయం 6 గంటల ప్రాంతంలో బేగంపేట ఫ్లైఓవర్ దిగుతుంది. అదే సమయంలో థార్ కారు వెళ్తుంది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్దకు రాగానే కంటైనర్ కారును బలంగా వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు వెనక భాగం పూర్తిగా ధ్వంసమైంది. కంటైనర్ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బోల్తాపడిన కంటైనర్‌ను రహదారి పక్కకు క్రేన్ ద్వారా జరిపారు.

భారీగా ట్రాఫిక్‌జామ్

భారీ క్రేన్‌సహాయంతో బోల్తాపడిన కంటైనర్‌ను మధ్యాహ్నం రెండు గంటలకు తరలించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేశారు. భారీ క్రేన్ రహదారిపై ఉంచడంతో పంజాగుట్ట, అమీర్‌పేట వైపు నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. సుమారు అరగంట పాటు బేగంపేట ఫ్లైఓవర్ నుంచి లాల్‌బంగ్లా, సీఎం కార్యాలయం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంటైనర్‌ను తొలగించిన అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించరించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాలి

బేగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, గిరిజనులు, మహిళల పట్ల వివక్షత నేటికీ కొనసాగడం బాధాకరమని, సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణి-దళిత స్త్రీ శక్తి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళల పట్ల జరుగుతున్న వివక్షత, అత్యాచారాలకు గురైన మహిళల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 55 మంది బాధితులు వచ్చి తమ సమస్యలు చెప్పడంతో పాటు పునరావాసం కల్పించాలని, పరిహారం ఇప్పించాలని, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ వినోద్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణికి 298 దరఖాస్తులు

సీఎం ప్రజావాణికి మొత్తం 298 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 90, రెవెన్యూకు 54, ఇందిరమ్మ ఇళ్ల కోసం 90, మున్సిపల్‌కు 17, ప్రవాసి ప్రజావాణికి 2, ఇతర శాఖలకు చెందిన 45 దరఖాస్తులు వచ్చాయి.

బర్డ్ వాచర్ జర్నల్ ఆవిష్కరణ



బర్డ్ వాచర్ జర్నల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆశిష్ పిట్టి, శివనాగేశ్వరరావు, రఫీ, చెన్నయ్య, తదితరులు

పంజాగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వారాంతంలో బర్డ్ వాచింగ్ కోసం ఎంతోమంది ఆసక్తిగా చెరువులు, పార్కులు, అడవులు సందర్శిస్తున్నారని, వారిలో ఎక్కువ శాతం యువతరం ఉంటున్నారని ప్రముఖ ఆర్నిథాలజిస్ట్ ఆశిష్ పిట్టి అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్, సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ఏ.మంగ రచన రేఖా చిత్రాలతో ప్రచురించిన బర్డ్ వాచర్ జర్నల్ పుస్తకాన్ని సినీదర్శకుడు, రచయిత శివనాగేశ్వరరావు, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తో కలిసి ఆయన ఆవిష్కరించారు. భాగ్యనగరం ప్రకృతిలో పక్షుల సంపద ఎనలేనిదని, పక్షుల ప్రేమికులు లక్షల సంఖ్యలో ఉన్నారని ప్రముఖ ఆర్నిథాలజిస్ట్ ఆశిష్ పిట్టి తెలిపారు. డాక్టర్ రఫీ మాట్లాడుతూ సరళమైన తెలుగు భాషలో అందరికి అర్థమయ్యే రీతిలో చక్కటి బొమ్మలతో హైదరాబాద్‌లోని అందమైన అరుదైన పక్షుల విశేషాలతో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. రచయిత్రి డాక్టర్ వి. ఏ.మంగ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తర్వాత సరదాగా తీసిన ఫొటోగ్రఫీకి చిక్కిన తేనెపిట్ట తనలో పక్షులపై విపరీతమైన ఆసక్తిని పెంచి అభిరుచిగా మార్చినట్లు తెలిపారు. ఐదేళ్ల హైదరాబాద్‌లోని కొండలు, గుట్టలు, చెరువులు అన్నీ తిరిగి వేలాది పక్షుల ఫొటోలను కెమెరాలో బంధించి నాలుగు పుస్తకాలు ప్రచురించినట్లు తెలిపారు. సినీదర్శకుడు శివనాగేశ్వరరావు, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య పుస్తకాన్ని సమీక్షిస్తూ పక్షులతో తమకున్న అనుబంధాన్ని, అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో జయహో పబ్లికేషన్స్ నిర్వాహకులు పి.వై. బాబు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



మానసిక ఆస్పత్రిలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎర్రగడ్డ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల ఎందరో అనారోగ్యానికి గురవుతున్నారని, అందులో చాలా మంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఎవరూ డ్రగ్స్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో..

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై వాటర్‌బోర్డులో అవగాహన కల్పించారు. ఖైరతాబాద్‌లోని వాటర్ బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం బోర్డు ఉన్నతాధికారులు, ఉద్యోగులతో డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వాడకం సామాజిక, మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తుందని, యువతను సరైన మార్గంలో పెట్టడమే లక్ష్యంగా నషా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, సీజీఎంలు, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి వింటర్ ఉత్సవ్ మేళా

● ప్రారంభించనున్న సినీ హాస్యనటుడు అలీ



వింటర్ ఉత్సవ్ మేళాలో ఓ సన్నివేశం

ఖైరతాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా ఒక్కో వినూత్న నమూనాతో నగరంలోని సందర్శకులను వింటర్ ఉత్సవ్ మేళా విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ మేళాను నెక్లెస్‌రోడ్(పీవీమార్గం)లోని పీపుల్స్‌ప్లాజాలో ప్రముఖ హాస్యనటుడు అలీ బుధవారం ప్రారంభించనున్నారు. మంగళవారం మేళా ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ ఈ యేడు మేళా విశేషాలను వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విశేషత కలిగిన 60 అడుగుల ఎత్తు, 125 అడుగుల వెడల్పులో విద్యుత్‌కాంతులతో ఆకర్షించే సెరియల్ వాటర్ ఫాల్, 10వేల సంవత్సరాల క్రితం అంతరించిపోయిన డైనోసార్, పోలార్‌బేర్, ఉలి రైనో, సీలయన్ లాంటి జంతువులను కళ్లకు కట్టినట్లు తయారు చేశారు. ప్రదర్శన ప్రవేశ ద్వారం 75 అడుగుల ఎత్తుతో లండన్ బిగ్ బ్యాన్ టవర్ నమూనాతో చూడముచ్చటగా తయారు చేశారు.



శివుడికి అభిషేకం చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, విశాల్ సుధాం

ఘనంగా లక్ష బిల్వార్చన

బేగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన పూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీభూలక్ష్మి ఆలయ నిర్మాణ దాత విశాల్ సుధాం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.



డీవీ చలపతిరావు, రాజావిశ్వేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

సంఘ సేవకులు చలపతిరావు సేవలు మరువలేం

ఎర్రగడ్డ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంఘ సేవకులు డీవీ చలపతిరావు సేవలు మరువలేమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం.నారాయణస్వామి అన్నారు. మంగళవారం డీవీ చలపతిరావు 38వ వర్ధంతి, డి.రాజావిశ్వేశ్వరరావు 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఎర్రగడ్డలోని వికాసపురి కాలనీలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవీ చలపతిరావు స్నేహానికి, మంచికి మారుపేరు అని పేర్కొన్నారు. అందరికీ ఆత్మీయులుగానూ, మార్గదర్శకంగానూ నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబసభ్యులు డి.వెంకటరత్నమ్మ, వెంకటేశ్వర్లు, భానుప్రసాద్, శ్రీనివాసరావు, కంజర్ల అన్నపూర్ణసదాశివ యాదవ్ పాల్గొన్నారు.

దుర్గగుడి అన్నప్రసాద వితరణకు విరాళం



గణపతిరావు, లీల దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారి

విజయవాడ(ఇంద్రకీలాద్రి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నప్రసాదం పంపిణీకి మంగళవారం హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన రాలి గణపతిరావు, లీల దంపతులు శిరీష, విశాల్, ఆద్య, దినేష్, యశ్వంత్ కుటుంబీకుల పేరిట రూ.1,00,116 విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అధికారులు అమ్మవారి చిత్రపటం, విరాళం రసీదు, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఊపిరి అందకుంటే సీఓపీడీ చేయించుకోవాలి

అమీర్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఊపిరి అందకుంటే తక్షణమే సీఓపీడీ చేయించుకోవాలని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ రవితేజ బుద్ధ అన్నారు. ప్రపంచ సీఓపీడీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో 'ఊపిరి అందట్లేదా, సీఓపీడీ గురించి ఆలోచించండి' థీమ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ మాట్లాడుతూ సీఓపీడీ సమస్యను త్వరగా గుర్తించగలిగితే రోగుల పరిస్థితి అసాధారణంగా మెరుగుపడుతుందన్నారు. తరచూ ఊపిరి సరిగా అందకపోవడం, దీర్ఘకాలికంగా దగ్గు, కఫం రావడం, దిగువ శ్వాసకోశంలో ఇన్ఫెక్షన్, పొగ తాగడం, వృత్తిపరమైన కలుషితాలకు గురికావడం వంటి వాటితో ఈ వ్యాధి వస్తుందన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే త్వరగా చికిత్స తీసుకోవాలని సూచించారు.

సోషల్‌మీడియాలో ట్రోలింగ్స్‌పై ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమపై ఆన్‌లైన్‌లో వస్తున్న ట్రోలింగ్స్‌పై మహిళా జర్నలిస్టులు మంగళవారం సీపీ వీసీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. ఇండిపెండెంట్ జర్నలిస్ట్ తులసీ చందుతోపాటు పలువురు మహిళా జర్నలిస్టులు సీపీని కలిసి తమపై నిరంతరం జరుగుతున్న ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య పదజాలం గురించి వివరించారు.



అధికారులతో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ హేమ

అధికారులతో కార్పొరేటర్ సమావేశం

బౌద్ధనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు వార్డు కార్యాలయంలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లో నెలకొన్న పలు ప్రధాన సమస్యలపై సమీక్షను చేపట్టారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, ప్యాచ్ వర్క్స్, నిధులు మంజూరైనా చేపట్టని పనులపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వంలో నిధుల కొరతతో చిన్నపనులు కూడా చేయలేకపోతున్నామని వాపోయారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్లు కుశాల్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సీఈఓను కలిసిన జయప్రకాష్

తిరుమలగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు నూతన సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్ కుమార్ ద్వివేదిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు వి.జయప్రకాష్ కలిశారు. మంగళవారం సీఈఓ చాంబర్‌లో 8వ వార్డు బొల్లారం కాంగ్రెస్ నాయకులు మనోజ్ కుమార్, రాజేశంలతో మర్యాదపూర్వకంగా కలసి సీఈఓను శాలువాతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ నూతన సీఈఓ కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజా సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలని, తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని సీఈఓకు తెలిపినట్లు జయప్రకాష్ తెలిపారు. ప్రధానంగా 8వ వార్డు బొల్లారం రిసాలాబజార్, సరస్వతినగర్, మందబాద్ తదితర ప్రాంతాల్లో అనేక సమస్యలు తిష్టవేశాయని ఇందుకోసం ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సాధించాలని సీఈఓను కోరినట్లు ఆయన పేర్కొన్నారు.



సర్వేలో పాల్గొన్న సీపీఎం నగర కమిటీ సభ్యుడు ఎం. అజయ్ బాబు

ప్రజా సమస్యలపై సీపీఎం నేతల సర్వే

అడ్డగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్టలో ఉన్న ప్రజా సమస్యలపై బస్తీలో పర్యటించి సర్వే చేస్తున్నామని సీపీఎం నగర కమిటీ సభ్యుడు ఎం. అజయ్‌బాబు తెలిపారు. మంగళవారం అడ్డగుట్ట డివిజన్‌లో సీపీఎం నాయకులతో కలిసి తుకారాంగేట్, మాంగోగిరోడి బస్తీ, బుద్ధానగర్, బోయబస్తీలోని పలు బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలపై సర్వే చేశారు. అదేవిధంగా పహాడి హనుమాన్ ఆలయం సమీపంలోని బోయబస్తీలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలకు ఇండ్లు నిర్మించాలని, లేదంటే అక్రమణకు గురవుతాయన్నారు. ఈ సర్వేలో సీపీఎం నాయకులు, జోన్ నాయకురాలు శారద, అంజమ్మ, భీమయ్యలు పాల్గొన్నారు.



ఆర్య వైశ్య సంఘం తుకారాంగేట్ కొత్త కార్యవర్గం సభ్యులు

ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గం

అడ్డగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్య వైశ్య సంఘం తుకారాం గేట్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా మల్లవోలు శ్రీకాంత్ , ప్రధాన కార్యదర్శి నాగబండి శ్రీనివాస్, కోశాధికారి నూకల నర్సింగ్‌రావులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో గంజి లక్ష్మణ్, తొడపనూరి లక్ష్మణ్, కర్ణకోట శ్రీనివాస్, రాధకృష్ణ, మాజీ అధ్యక్షులు నాగబండి సుధాకర్, ఎల్లంకి వీరేశం, నేతి నరేష్, కాసుల లక్ష్మణ్ గుప్త, నాగబండి శ్రీకాంత్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓయూలో నియామకాలు



నియామక పత్రం అందుకుంటున్న ప్రొ. శ్రీనివాసు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మంగళవారం కీలక విభాగాల్లో నియామకాలు ప్రకటించారు. ప్రొఫెసర్ సి.శ్రీనివాసును రాష్ట్రీయ ఉన్నత విద్యా అభియాన్ (ఆర్‌యూఎస్‌ఏ) నోడల్ ఆఫీసర్-1గా నియమించడంతో పాటు, హార్టీకల్చర్- గ్రీన్ బెల్ట్ డైరెక్టర్ పదవిని మరో ఏడాది పాటు పొడిగించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి ప్రొఫెసర్ కె.దీప్లాను కొత్త డైరెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా వారికి ఓయూ బోధన, పరిపాలనా సిబ్బంది అభినందనలు తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడా స్ఫూర్తితో ఆడాలి

- జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చందనా సర్పే
- ప్రారంభమైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల తొమ్మిది జిల్లాల క్రీడలు

బోయినపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల క్రీడలు వసతి గృహాల తొమ్మిది జిల్లాల అండర్ - 14, అండర్ -17 బాల బాలికల జోనల్ స్థాయి క్రీడా పోటీలు, రాష్ట్రస్థాయి క్రీడల జట్ల ఎంపిక మంగళవారం సికింద్రాబాద్ బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో గిరిజన సంక్షేమశాఖ క్రీడల అధికారిని జ్యోతి పర్యవేక్షణలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చందనా సర్పే, అతిథులుగా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్. కోటాజి, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్‌లు హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ చందనా సర్పే మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడిన వారే భవిష్యత్తులో రాణిస్తారని తెలిపారు. బాపూజీనగర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఆధ్వర్యంలో మూడోసారి జోనల్ క్రీడలకు ఆతిథ్యమిస్తున్నదని, అందుకు కృషి చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులను, పాఠశాల పీడీ, పీఈటీలు, కోచ్‌లను ఆమె అభినందించారు. తొమ్మిది జిల్లాల నుంచి వచ్చిన బాల బాలికలు ఆత్మ విశ్వాసంతో ఆడి విజయం సాధించాలన్నారు. జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఏటూరు నాగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బానోతు లాలూ నాయక్, ఎం. అముక్త మాల్యద, టీడబ్ల్యూ వాటర్ స్పోర్ట్స్ అకాడమీ హెచ్‌డబ్ల్యూఓ నీలిమ, పీఈటీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ అందిస్తాం



జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏటూరు నాగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించేందుకు ప్రత్యేక కోచ్‌లతో శిక్షణను అందిస్తాం. విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించడంతో పాటు, క్రీడా కిట్లను అందజేస్తాం.

- జ్యోతి క్రీడల అధికారిని

పాల్గొనడం రెండోసారి



నేను ఈ క్రీడలలో పాల్గొనడం రెండవ సారి. గత సంవత్సరం కబడ్డీ క్రీడలో ఫైనల్ వరకు చేరుకున్నాం. ఈసారి కూడా మంచి ప్రతిభ కనబర్చి ఈ జోన్‌కు బంగారు పతకం వచ్చేలా కృషి చేస్తా.

- కె నీల, రంగారెడ్డి జిల్లా

వసతులు బాగున్నాయి



బోయినపల్లిలో జరుగుతున్న క్రీడల్లో వసతులు బాగున్నాయి. నేను ఇక్కడ పాల్గొనడం రెండోసారి. రాష్ట్రస్థాయిలో రాణించి పతకం సాధిస్తాం.

- మంజుల, ఖోఖో క్రీడాకారిణి, సంగారెడ్డి

ఛాంపియన్స్‌గా నిలుస్తాం



ఈసారి మా జట్టు బలంగా ఉంది. అందరం ఐక్యతతో రాణించి ఈ సంవత్సరం ఛాంపియన్స్‌గా తిరిగి వస్తాం. అధికారులు ఏర్పాట్లు బాగా చేశారు. భోజనం చాలా బాగుంది.

- రామ్ చరణ్, హైదరాబాద్

తొలగిస్తారా.. తొలగించాలా?

- ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై కొరడా
- కంటోన్మెంట్ బోర్డు యాక్షన్ ప్లాన్



కంటోన్మెంట్ బోర్డు

సికింద్రాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ చరిత్రలో తొలిసారిగా ఆక్రమణల తొలగింపుకు బోర్డు యంత్రాంగం యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపుపై కొరడా ఝళిపిస్తూ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం కఠిన చర్యలకు సన్నద్ధమైంది. మునుపెన్నడూ లేనివిధంగా, మొట్టమొదటిసారిగా పబ్లిక్ రోడ్లు, నాలాలు, డ్రైన్లు, పార్కులు, ఫుట్‌పాత్‌లతోపాటు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను ఏడు రోజుల్లో తొలగించాలని సోమవారం పబ్లిక్ నోటీసు జారీ చేసింది. నోటీసు జారీ చేసిన రోజు నుంచి ఏడు రోజుల్లో ఆక్రమణలు స్వయంగా తొలగించాలని, లేదంటే కంటోన్మెంట్ చట్టం 2006 ప్రకారం మరో నోటీసు లేకుండా తామే నేలమట్టం చేస్తామని ఉంటుందని తెలిపింది. తాము జారీ చేసిన పబ్లిక్ నోటీసునే తుది నోటీసుగా ఆక్రమణదారులు భావించాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ, ప్రజల భద్రత, ట్రాఫిక్ అవాంతరాలు కలగకుండా చూడడంలో కంటోన్మెంట్ బోర్డుకు ప్రజలు సహకరించాలని కోరారు. కాగా ఆక్రమణలను స్వయంగా తొలగించని పక్షంలో తామే ప్రత్యేక డ్రైవ్ ద్వారా తొలగిస్తామని, ఇందుకు అయ్యే ఖర్చును ఆక్రమణదారుల నుంచి వసూలు చేస్తామని బోర్డు అధికారులు వెల్లడించారు.

ఫిర్యాదుల ఫలితమే..

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని 8 వార్డుల్లో కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై వెలిసిన ఆక్రమణలపై గడిచిన కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండడంతో బోర్డు యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. డి.మధుకర్ నాయక్ స్థానంలో కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అర్విండ్‌కుమార్ ద్వివేదీ ఈ విషయమై చాలా సీరియస్‌గా ఉన్నట్టు చెబుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలను, ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, కఠినంగా వ్యవహరిద్దామంటూ అధికారులను సైతం ఆయన అప్రమత్తం చేసినట్టు తెలిసింది.

మాదకద్రవ్య రహితంగా తెలంగాణ : మంత్రి అడ్లూరి



వైద్య విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

అడ్డగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం గాంధీ మెడికల్ కాలేజీలోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన నషా ముక్తి భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల దుష్పరిణామాలపై విద్యార్థులు, మెడికల్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే వీటికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల క్రయ విక్రయాలపై సమాచారం ఉంటే నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు, నర్సులు, వైద్యులతో మాదక ద్రవ్యాల నివారణపై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, ఈగల్ టీం ఐపీఎస్ అధికారి రామచంద్రన్, శైలజ, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు రాసిచ్చిన మందులే వాడాలి : డాక్టర్ ఇందిర



గాంధీ ఆస్పత్రి ఆవరణలో వరల్డ్ యాంటి బయాటిక్ వారోత్సవాల్లో పాల్గొన్న వైద్యులు

అడ్డగుట్ట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు రాసిచ్చిన యాంటిబయోటిక్ మందులే వాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర సూచించారు. మంగళవారం గాంధీ ఆస్పత్రి ఆవరణలో ప్రపంచ యాంటి బయోటిక్ వారోత్సవాల ర్యాలీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా వైద్యులు రాసిచ్చిన యాంటిబయాటిక్ మందులే వాడాలని, వ్యక్తిగతంగా మందులు వాడకూడదని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఆస్పత్రి, మెడికల్ కాలేజీ ఆవరణలో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, మైక్రో బయాలజీ విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ సురేఖ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మేశ్వర్, రమేష్‌తో పాటు గాంధీ మెడికల్ కాలేజీ పీజీ మైక్రో బయాలజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

బోయినపల్లి చిన్నతోకట్ట కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుష్మ, సుమిత్ర, భాగ్యలక్ష్మి, అశోక్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

- బోయినపల్లి, ఆంధ్రజ్యోతి

ఘనంగా లక్ష బిల్వార్చన



శివాలయంలో జరిగిన పూజల్లో మంత్రి దామోదర రాజనర్సింహ, విశాల్ సుధాం

బేగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన పూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీభూలక్ష్మి ఆలయ నిర్మాణ దాత విశాల్ సుధాం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీలపై ఏఐసీటీఈ చైర్మన్‌కు ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు ఏఐసీటీఈ(ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా డొనేషన్లు, ఫీజుల రూపంలో లక్షలు వసూలు చేస్తున్నాయని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ ఫౌండర్ వలిగొండ నరసింహ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అరోరా, వీఎన్ఆర్, సీవీఆర్, గీతాంజలి, గోకరాజు రంగరాజు, కేఎంఐటీ, నారాయణమ్మ, వర్ధమాన్ వంటి పలు ఇంజినీరింగ్ కళాశాలపై ఏఐసీటీఈ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. విద్యను వ్యాపారంగా చేసి నిరుపేద ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఇంజనీరింగ్ విద్యకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విచారణ చేసి ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఓయూలో కొనసాగుతున్న అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రమోషన్లలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు 48రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం ఓయూ టీచర్స్ అసోసియేషన్(ఔటా) ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కాలేజీ వద్ద భోజన విరామంలో ఆందోళన చేపట్టారు. ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.మనోహర్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో ఎన్నడూ లేనివిధంగా 48 మంది అధ్యాపకులను రిజెక్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని అధ్యాపకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేష్‌కుమార్, సంధ్యారెడ్డి, పద్మజ, ఎం.వి.రమణారావు, రమేష్, అపర్ణ, మాధురి, శశికళ, సుజాత, పి.రమేష్, నతానియల్, మెలిసా ఎలెన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల చేయాలి : ఏబీవీపీ



ఆర్ట్స్ కాలేజీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ విద్యార్థుల అకడమిక్ భవిష్యత్తు తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది. ఐదేళ్లుగా అకడమిక్ ఇయర్ నిరంతరంగా జాప్యం అవుతుండటంతో విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా మారింది. సెమిస్టర్ ఫలితాల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు ప్రతి సంవత్సరం అకడమిక్ క్యాలెండర్ సర్దుబాటు చేస్తామని హామీ ఇస్తున్నప్పటికీ, వాస్తవంగా మాత్రం జాప్యం జరుగుతూనే ఉంది. కామర్స్, ఆర్ట్స్, సైన్స్ విభాగాలకు సంబంధించిన రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు ఆగస్టులో పూర్తయినా ఇప్పటికీ ఫలితాలు ఇప్పటికీ విడుదల చేయలేదు. వాస్తవానికి 45 రోజుల్లో రిజల్ట్స్ ప్రకటించాల్సి ఉన్నా, మూడు నెలలు గడిచినా ఫలితాలు రాకపోవడంతో దేశ, విదేశీ ఉన్నత విద్య అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ నియామక ప్రక్రియల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజల్ట్స్ రాక కొత్త నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కెచ్ పెన్‌తో అందమైన చిత్రాలు





స్కెచ్ పెన్నుతో చలంచర్ల జునాలి బాలిక గీసిన అరుదైన చిత్రాలు





మారేడుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ మారేడుపల్లికి చెందిన డాక్టర్ చలంచర్ల సునీల్ కుమార్, సంధ్యారాణి దంపతుల కుమార్తె చలంచర్ల జునాలి స్కెచ్ పెన్ నుంచి జాలువారిన చిత్రాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అరుదైన చిత్రాల ద్వారా ప్రతిభ చాటడంతో తల్లిదండ్రులు మంగళవారం మిఠాయిలు తినిపించి కుమార్తెను అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అమ్మాయి 14 నుంచి 16వ తేదీ రెండు రోజుల పాటు పంజిమ్ గోవాలో ఆల్ ఇండియా అర్బన్ స్కెచర్స్ 2025 పేరున జరిగిన వార్షిక గోవా స్కెచర్స్ కార్నివాల్‌లో పాల్గొని తన ప్రతిభను చాటింది. జునాలి గోవాలోని పలు పురాతన కట్టడాలు, అక్కడి పౌరుల జీవనశైలిని స్కెచ్ పెన్ ద్వారా చిత్రించి అబ్బురపరిచింది. సింధు దుర్గంకోట ప్రహరీ, వైస్రాయ్ ఆర్చ్, ఫాంటన్హస్‌లో పోర్చుగల్ గృహాలు, దోనపౌల శిల్పం తదితర వాతావరణానికి అనుకూలంగా 25 స్కెచ్ చిత్రాలు చిత్రించి ఆకట్టుకుంది. గతంలో ఇలాంటి కార్యక్రమాలకు కూడా హాజరై తన ప్రతిభను చాటింది. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాల్లోని వివిధ నగరాల నుంచి చిత్రకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.